# కలెక్టర్ ఆదేశాలతో లబ్బూరు ఏకలవ్యలో అధికారుల సందర్శన

- నీటి సమస్య పరిష్కారానికి 40 లక్షల రూపాయల కేటాయింపుకు ప్రతిపాదన.
- నీటి సమస్య పరిష్కరించకపోతే విద్యార్థులకు తమతమ ఇంట్లోకి తీసుకువెళ్లి పోతామన్న తల్లిదండ్రులు.





**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబర్ 22.**మండలంలో గల జోలపుట్టు పంచాయితీ, లబ్బూరు ఏకలవ్య పాఠశాలలో నీటి సమస్య పరిష్కారానికి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో జిల్లా ఆర్డబ్ల్యూఎస్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు బుధవారం సందర్శించారు. ఏకలవ్యలో నీటిని అందించుటకు నీటి వనరులను జిల్లా అధికారులు పరిశీలించారు. నీటి సమస్య పరిష్కరించడానికి 40 లక్షల రూపాయలు నిధులు కేటాయించుటకు ప్రభుత్వానికి ప్రతిపాదన చేస్తున్నట్లు జిల్లా ఆర్డబ్ల్యూఎస్ ఈఈ నాగేశ్వరరావు తెలిపారు. ఏకలవ్య నిమిత్తం జిల్లా పరిషత్ నిధులనుండి రెండు బోర్లు ఏర్పాటుకు జెడ్పీ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర నిధులు కేటాయిస్తున్నట్లు వైసిపి నేత అరబీరు జగబంధు తెలిపారు. పాఠశాల సందర్శనకు వచ్చిన అధికారులతో పాఠశాల ఎస్ఎంసి కమిటీ సభ్యులు కలిసి తక్షణమే ఏకలవ్య నీటి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాల తరలింపు నుండి నీటి సమస్య పరిష్కారానికి అనేకమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లిన సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే తమ పిల్లలకు పాఠశాల నుంచి తమ తమ గ్రామాలకు తీసుకువెళ్తామని తీర్మానించుకున్నట్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా ఆర్డబ్ల్యూఎస్ ఈఈ తెలిపారు. అయితే లబ్బూరు ఏకలవ్య నీటి సమస్యపై గతంలో అనేక వార్త కథనాలు ప్రచురితమైన సంగతి గమనార్హం. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ డీఈ సునీల్ కుమార్, జేఈ రాజేష్, ట్రైబల్ వెల్ఫేర్ ఏఈఈ రాము, వర్కింగ్ ఇన్స్పెక్టర్ మల్లేష్, వైసిపి నేత అరబీరు జగబంధు, మకరం పంచాయతీ మాజీ సర్పంచ్ పరశురాం, మాజీ సర్పంచ్ రామస్వామి, ఎస్ఎంసి కమిటీ చైర్మన్ రామదాసు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమానికి ఏర్పాట్లు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్ అక్టోబర్ 22:**గూడెం కొత్తవీధి మండలకేంద్రంలో ఈ నెల 25వ తేదీ శనివారం నాడు "ఆత్మ నిర్భర్ భారత్ సంకల్ప అభియాన్" కార్యశాల కార్యక్రమం నిర్వహించనున్నట్టు బీజేపీ మండలాధ్యక్షుడు కాకూరి శేఖర్,ఎంపీటీసీ, బీజేపీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ రిమల రాజేశ్వరి పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అల్లూరి సీతారామరాజు జిల్లా బీజేపీ అధ్యక్షురాలు మఠం శాంత కుమారి, రాష్ట్ర ట్రైఫెడ్ డైరెక్టర్ కృష్ణరావు, రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షుడు పాంగి రాజారావు హాజరుకానున్నారు.కార్యక్రమంలో స్వయం సమృద్ధి, గ్రామాభివృద్ధి, స్థానిక ఉత్పత్తుల ప్రోత్సాహంపై అవగాహన కల్పించనున్నారు. అనంతరం గూడెం కొత్తవీధి మండలంలో జరుగుతున్న ప్రధానమంత్రి గృహ నిర్మాణాల పనితీరును పరిశీలిస్తారని నిర్వాహకులు తెలిపారు. అలాగే, మండలంలో ప్రధానమంత్రి ఇళ్ల సమస్యలు, రహదారి సమస్యల వంటి అంశాలను జిల్లా అధ్యక్షురాలికి నేరుగా వినతులు సమర్పించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో బోండ్ల చిరంజీవి, చల్లంగి అచ్యుత్, బూడిద పెద్దబ్బాయి, బూడిద దారలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మండలకాల మహా అన్నదానోత్సవం ప్రారంభం

అన్నదానమే మహాదానం: రైల్వే డిఆర్ఎం లలిత్ బోహ్రా



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 22** :"అన్ని దానాల్లో అన్నదానం అత్యుత్తమమైనది" అని విశాఖపట్నం రైల్వే డిఆర్ఎం లలిత్ బోహ్రా పేర్కొన్నారు. అల్లిపురం వైర్లెస్ కాలనీలోని శ్రీ కోదండరామాలయం ప్రాంగణంలో శ్రీహరి హరా త్మజ అన్నదాన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలకాల మహా అన్నదానోత్సవం బుధవా రం ఘనంగా ప్రారంభమైంది.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన లలిత్ బోహ్రా భక్తు లకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించారు. తరు వాత మాట్లాడుతూ దీక్షలో ఉన్న మాలధారు లకు పరిశుభ్రంగా, ప్రేమతో అన్నదానం చేయడం నిజమైన సేవ అని అన్నారు.ట్రస్ట్ అధ్యక్షులు, గురుస్వామి కె. రమణమూర్తి మాట్లాడుతూ,శ్రీ అయ్యప్ప స్వామి అనుగ్రహంతో అక్టోబర్ 22 నుంచి డిసెంబర్ 1 వరకు ప్రతి రోజు స్వాము లకు శుద్ధమైన, రుచికరమైన భోజనం అందించే సంకల్పం చేశాం" అని తెలిపారు. మొదటి రోజున వెయ్యి మందికి పైగా స్వాములకు అన్నప్రసాదం వడ్డించామని, రాబోయే రోజుల్లో ఈ సంఖ్య 2000 దాకా పెరుగుతుందని వెల్ల డించారు.అలాగే డిసెంబర్ 4వ తేదీ గురువారం నాడు శబరిమల యాత్రను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు వస్తురూపేణ గానీ, ధనరూపేణ గానీ ఈ మహాదానంలో భాగస్వా ములు కావాలని కోరారు. విరాళాలు శ్రీహరి హరాత్మజ అన్నదాన చారిటబుల్ ట్రస్ట్, విశాఖ పట్నం పేరుతో సమర్పించి రసీదు పొందవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో శ్రీ కోదండరామాలయ కమిటీ అధ్యక్షులు కే. కోటేశ్వరరావు, ట్రస్ట్ వ్యవస్థా పకులు గురుస్వామి కడగల శ్రీను, ఆలయ కార్యదర్శులు కే. సుబ్రహ్మణ్యం, కే. శ్రీనివాస్, సభ్యులు కోరాడ అప్పారావు, రామకృష్ణారెడ్డి, పి. అవతార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# తర్లువాడ అభివృద్ధితో ఆనందపురం కూటమి విజయభేరీ మోగించాలి-గంటా శ్రీనివాసరావు





**భీమిలి, పెన్ పవర్, అక్టోబర్ 22** :రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆనందపురం మండలం నుంచి కూటమి అభ్యర్థులు ప్రతీ స్థా నం గెలిచి ఘన విజయం సాధించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పిలుపునిచ్చా రు. ఆనందపురం టీడీపీ కొత్త కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, పార్టీ కార్యకర్తలకు ఉత్సాహం నింపారు.తర్లువాడలో జరిగిన సభలో మాట్లాడుతూ గంటా తెలిపారు అసెంబ్లీ ఎన్నికల్లో 26 పంచాయతీల్లోనూ నాకు మెజారిటీ ఇచ్చినట్లే ఈసారి ప్రతి స్థానంలో కూటమి జెండా ఎగరాలి. పదవి అనేది ప్రతిష్ట కాదు, బాధ్యత. టీడీపీ, జనసేన, బీజేపీ ఒకే కుటుంబం. వర్గాలు, విభేదాలు పక్కన పెట్టి సమష్టిగా పనిచేయాలి అన్నారు.2014-19 మధ్య కాలంలో మంత్రిగా రూ. 4,700 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి సాధించానని గుర్తుచేసి న గంటా,93 వేల ఓట్ల మెజారిటీ ఇచ్చిన ప్రజల కు అభివృద్ధి రూపంలో కానుక ఇస్తూ రుణం తీర్చుకుంటాను" అన్నారు.తర్లువాడకు ప్రపంచ గుర్తింపు గూగుల్ డేటా సెంటర్ రాకతో తర్లువాడ పేరు ప్రపంచమంతా మార్మో గుతుందన్నారు. "భూములు ఇచ్చిన రైతులు సంతోషంగా ఉండేలా చూస్తాం. అవసరమైతే ప్రభుత్వ పాలసీ మార్చడానికి కూడా సిద్ధం. సీఎం చంద్రబాబు స్వయంగా తర్లువాడ పరిహా రం అంశంపై సానుకూల నిర్ణయం తీసుకున్నా రు, అని చెప్పారు.గూగుల్ ప్రాజెక్ట్ కోసం భూములు ఇచ్చిన రైతులకు నష్టపరిహారం, ఉపాధి అవకాశాలు, ఇళ్ల స్థలాలు ఇవ్వను న్నట్లు హామీ ఇచ్చారు. గంభీరం ఐఐఎం భూసేకరణ మోడల్ దేశానికే ఆదర్శమని పేర్కొన్నారు.టీసీఎస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్, సిఫీ, సత్వా వంటి ప్రముఖ కంపెనీల రాకతో విశాఖపట్నం త్వరలో ఐటీ హబ్గా రూపాంతరం చెందుతుందని అన్నారు. ప్రజలను మోసం చేసిన వైసీపీ సంక్షేమం అందించే కూటమి వైసీపీ ప్రభుత్వం ప్రతి పథకాన్ని షరతులతో ప్రజలపై భారమయ్యేలా మార్చిందని మండిపడ్డ ఆయన, కూటమి ప్రభుత్వం షరతులు లేని సంక్షేమాన్ని అందిస్తుంది. పెన్షన్ నుంచి తల్లికి వందనం వరకూ ప్రజల ఆశలు తీర్చేలా వ్యవస్థ ఉండబోతుంది" అని అన్నారు. అంతకుముందు ఆనందపురం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నుంచి తర్లువాడ జంక్షన్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి తర్లువాడ సర్పంచ్ బి.ఆర్. బి. నాయుడు అధ్యక్షత వహించారు. ఆనంద పురం, భీమిలి, పద్మనాభం మండల టీడీపీ అధ్యక్షులు తాట్రాజు అప్పారావు, కోరాడ రమణ, సరగడ అప్పారావు, కూటమి నాయ కులు ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, చిక్కాల విజయ్ బాబు, గాదు వెంకటప్పడు, ఎర్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్య రక్షణ దిశగా ఫుడ్ సేఫ్టీ విభాగం బలోపేతానికి కృషి రఘురామ కృష్ణరాజు

## విశాఖలో ప్రాంతీయ ల్యాబరేటరీ ప్రారంభం సిబ్బంది నియామకానికి చర్యలు వేగవంతం





**విశాఖ దక్షిణం ,పెన్ పవర్, అక్టోబర్ 22:** రాష్ట్ర ప్రజారోగ్యాన్ని మెరుగుపరిచే దిశగా ఫుడ్ సేఫ్టీ విభాగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని శాసనసభాపక్ష ఫిర్యాదుల కమిటీ చైర్మన్, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు తెలిపారు. బుధవారం విశాఖపట్నం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో జరిగిన సమీక్ష అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు.ఫుడ్ సేఫ్టీ విభాగం ప్రాధాన్యతను ప్రస్తావిస్తూ, రాష్ట్రంలో ప్రజారోగ్య పరిరక్షణకు ఇది కీలకమని ఆయన అన్నారు. "ఫుడ్ సేఫ్టీ వ్యవస్థను బలోపేతం చేసి రాష్ట్ర ర్యాంకును మెరుగుపరచేందుకు సమగ్ర కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం,".అని తెలిపారు.

పస్తుతం రాష్ట్రంలో 500 మంది సిబ్బంది అవసరమున్నప్పటికీ, కేవలం 25 శాతం సిబ్బం దే పనిచేస్తున్నారని రఘురామ వివరించారు. రాష్ట్ర విభజన తర్వాత ల్యాబరేటరీల సంఖ్య తగ్గిపోవడంతో నాలుగు ల్యాబ్లు ఇంకా పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించలే దని తెలిపారు. వాటిని యుద్ధప్రాతిపదికన ఆపరేషన్లోకి తెచ్చేలా అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.విశాఖలో రీజనల్ ల్యాబ్ త్వరలో ఫుడ్ కల్తీ పరీక్షల కోసం అత్యా ధునిక ల్యాబ్ సదుపాయాలను విశాఖపట్నంలో అందుబాటులోకి తెస్తాం. నవంబర్ తొలి వారం లో రీజనల్ ల్యాబరేటరీ ప్రారంభం కానుంది. సిబ్బంది నియామక ప్రక్రియపై కలెక్టర్తో చర్చించాం,అని తెలిపారు.రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ ఇండెక్స్లో ప్రస్తుతం 29వ స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ను వచ్చే ఏడాదిలో 15వ స్థానానికి, ఆపై టాప్%-%5లోకి తీసుకురావడమే కమిటీ లక్ష్యమని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయా ల సిబ్బందిలో అర్హులైన వారిని ఈ విభాగంలో నియమించేందుకు చర్యలు ప్రారంభించామని వెల్లడించారు.హీమోఫీలియా చికిత్సకు సదుపాయాల మెరుగుదలహీమోఫీలియా రోగులకు చికిత్స అందించడంలో ఉన్న ఇబ్బం దులను గుర్తించి, కేజీహెచ్లో అవసరమైన సదుపాయాలను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించినట్లు రఘురామ తెలిపారు. "ప్ర భుత్వం ఉచితంగా అందిస్తున్న ఆర్.8, ఆర్.9 ఇంజెక్షన్లు, మోనోక్లోనల్ యాంటీబయోటిక్స్ వంటి ఔషధాలను సమర్థవంతంగా వినియోగించేందుకు ప్రత్యేక పర్యవేక్షణ అవసరమని సూచించాం," అన్నారు.విశాఖ అంతర్జాతీయ వేదికగా ఎదుగుతున్న నేపథ్యంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి పిటిషన్ల కమిటీ సమావేశాలను ఇక్కడే నిర్వహించాలనే నిర్ణయం తీసుకున్నామని రఘురామ కృష్ణరాజు వెల్లడించారు.

మీడియా సూచనలకు ఆహ్వానం

"ఆహార కల్తీ నివారణ, ఫుడ్ సేఫ్టీ బలోపేతం దిశగా మీడియా ప్రతినిధులు తమ సూచనలు అందిస్తే, వాటిని అమల్లోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తాం," అని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు, కొణతాల రామకృష్ణ పాల్గొన్నారు. అనంతరం కమిటీ సభ్యులు ఫుడ్ సేఫ్టీ అవగాహన కరపత్రాలను విడుదల చేశారు.

# 41 కేజీల గంజాయి పట్టివేత - ఒకరు అరెస్ట్



రూ. 80 వేల నగదు, కారు స్వాధీనం

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,అక్టోబర్ 22:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి పోలీసులు అక్రమ గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ క్రమంలో వారు నిర్వహించిన ఓ ఆపరేషన్లో 41 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అరెస్ట్ చేశారు.డేరాల జంక్షన్ వద్ద వాహన తనిఖీలు జరుగుతున్న సమయంలో, పోలీసులు అనుమానాస్పదంగా వెళ్తున్న ఏపీ 39 కెఎం 4224 నంబరు గల కారు ను ఆపి తనిఖీ చేశారు. ఆ కారులో బస్తాల్లో నింపిన 41 కేజీల గంజాయి లభ్యమైంది. దీనితోపాటు, నిందితుడైన కలిదిండి నూకరాజు (తండ్రి: శ్రీనివాసరావు), దారకొండ గ్రామానికి చెందినవాడు గంజాయిని మైదాన ప్రాంతాలకు తరలిస్తున్నట్లు గుర్తించారు. అతని వద్ద నుంచి రూ. 80 వేల నగదు, మొబైల్ ఫోన్, కారు స్వాధీనం చేసుకున్నారు.ఈ ఆపరేషన్ను గూడెం కొత్త వీధి ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు విజయవంతంగా నిర్వహించారు. ఎస్సై సురేష్ మాట్లాడుతూ, "అల్లూరి జిల్లాలో గంజాయి రవాణా ముఠాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. చట్టం ఉల్లంఘించిన వారిని ఉపేక్షించం. మరిన్ని నిందితులపై దర్యాప్తు కొనసాగుతోంది," అని హెచ్చరించారు.అరెస్టు చేసిన నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

# పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి.

**2024 లో ఇచ్చిన జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలి .**

**సిఐటియు .**

**అరకులోయ పెన్ పవర్ 22:**2024 నవంబర్లో ప్రభుత్వ హాస్పిటల్లో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు నెలకు 18 600 వేతనం ఇవ్వాలని జీవోలో ఉన్న సంబంధిత కాంట్రాక్టర్ అమలు చేయకుండా మోసం చేశాడని తక్షణం జీవో ప్రకారం వేతనం చెల్లించి ఏరియల్ చెల్లించాలని డిమాండ్ చేశారు ఈ మేరకు బుధవారం యూనియన్ పిలుపుమేరకు అరకులోయ ఏరియా ఆసుపత్రి ముందు శానిటేషన్ కార్మికులు సమ్మె చేపట్టారు ఉదయం నుంచి విధులు బహిష్కరించి నిరసన తెలియజేశారు. సమ్మెను ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు జిల్లా సహాయ కార్యదర్శి భగత్ రామ్ , ప్రభుత్వ హాస్పిటల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి రఘు మాట్లాడుతూ కాంట్రాక్టర్ కి, ఉన్నత అధికారులకి స్థానిక ఎమ్మెల్యేలకి సమాచారం ఇచ్చామని అంతకుముందు సమ్మె నోటీసు సంబంధిత కాంట్రాక్టర్ కి అధికారులకి ఇవ్వడం జరిగిందని తెలిపారు. కార్మికులు న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని అన్నారు. చట్ట ప్రకారం 9 జాతీయ సెలవులు ఇవ్వాలని, మహిళలకు జీతంతో కూడిన మేటర్నిటీ లీవ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేతనాలు సకాలంలో రావడంలేదని ప్రతినెల 5వ తారీఖున వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కొత్తగా జాయిన్ అయిన వారికి పీఎఫ్ సౌకర్యం కల్పించాలని పాతవారికి పిఎఫ్ సమస్య ఉందని తక్షణం దాని పరిష్కరించాలని అన్నారు. కార్మికులకు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. బకాయి వేతనాలు తక్షణం చెల్లించాలని తెలిపారు. డ్యూటీ చార్ట్ ఏర్పాటు చేసి పని భారం తగ్గించాలని అన్నారు. అర్హులైన కార్మికులకు సూపర్వైజర్ ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు తక్షణం



కాంట్రాక్టర్ యూనియన్ నాయకులతో చర్చించి పరిష్కరించాలని లేకుంటే సమ్మెను వివిధ రూపాల్లో ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ద్రౌపతి, బాలన్న తదితరులు పాల్గొన్నారు.

